క్లుప్తంగా

పైడియ్య కుటుంబానికి ఎంవీవీ పరామర్శ



పెదపైడియ్య భౌతికకాయం వద్ద నివాళులు అర్పిస్తున్న ఎంపీ ఎంవీవీ తదితరులు

ఎంవీపీకాలనీ: ఎంవీపీ కాలనీ మూలపాలెంలో నివసిస్తున్న వైఎస్సార్‌సీపీ సేవాదళ్ 18వ వార్డు అధ్యక్షుడు వాసుపల్లి పైడియ్య తండ్రి పెద పైడియ్య గురువారం వేకువజామున మరణించారు. ఆయన భౌతికకాయానికి విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ నివాళులర్పించారు. పైడియ్య కుటుంబ సభ్యులను పరామర్శించి, ఓదార్చారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాల అండగా ఉంటామని ఎంవీవీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మత్స్యకార కార్పొరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పేర్ల విజయచందర్, వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు వాసుపల్లి ఎల్లాజీ, మరుపల్లి పరదేశి, సతీష్, వెంకటపతిరాజు, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు సామూహిక సూర్యనమస్కారాలు

ఎంవీపీకాలనీ: ఓం ఉచిత యోగా సంస్థ ఆధ్వర్యంలో శుక్రవారం సామూహిక సూర్యనమస్కారాల కార్యక్రమం జరుగుతుందని సంస్థ ప్రతినిధులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. రథసప్తమి పర్వదినాన్ని పురస్కరించుకుని సీతమ్మధార ఆక్సిజన్ టవర్స్ వేదికగా ఉదయం 5 గంటల నుంచి 108 రౌండ్స్ పాటు సూర్యనమస్కారాలు నిర్వహిస్తామని చెప్పారు.

బీసీ కమిషన్ సభ్యుడికి శుభాకాంక్షలు



మారేష్‌ను అభినందిస్తున్న పితాని ప్రసాద్

ఏయూక్యాంపస్: రాష్ట్ర బీసీ కమిషన్ సభ్యుడిగా నియమితుడైన డాక్టర్ ఎస్.మారేష్‌ను ఏపీ బీసీ సంఘం రాష్ట్ర కన్వీనర్ పితాని ప్రసాద్ అభినందించారు. విజయవాడలో మారేష్‌ను కలిసి పుష్పగుచ్ఛం, మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. బీసీ కమిషన్ సభ్యుడిగా నియమించడంపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. డాక్టర్ శ్యామ్ సుందర్‌నాయుడు, రాజులపాటి కల్యాణి, వేముల బేబేరాణి, మాధవి తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ వలంటీర్లకు అభినందన



అవార్డులు పొందిన వలంటీర్లను అభినందిస్తున్న అప్పారి గిరిబాబు

మద్దిలపాలెం: జీవీఎంసీ 15వ వార్డులో ఉత్తమ సేవలందించి అవార్డులు పొందిన వలంటీర్లను గురువారం వైఎస్సార్‌సీపీ వార్డు నాయకుడు అప్పారి గిరిబాబు అభినందించారు. సేవావజ్ర అవార్డు పొందిన హిమబిందుతో పాటు ఎల్లాజీ, ప్రమీల, జగదీశ్వరిలను ఆయన ప్రశంసించారు. కార్యక్రమంలో వార్డు అధ్యక్షుడు పీలా వెంకట్, పడమట సురేష్, శ్రీనివాస్‌రెడ్డి పాల్గొన్నారు.

గోవా గవర్నర్ రాక నేడు

మహారాణిపేట: గోవా గవర్నర్ పి.ఎస్. శ్రీధరన్ పిళ్లాయ్ శుక్రవారం విశాఖ వస్తున్నారు. ఢిల్లీ నుంచి శుక్రవారం ఉదయం 8.20 గంటలకు విశాఖ విమానాశ్రయం చేరుకుంటారు. కొద్ది సేపు విశ్రాంతి అనంతరం భోగాపురంలో ఉన్న సన్ రే రిసార్ట్స్‌కు వెళతారు. అక్కడ జరిగే ఓ కార్యక్రమంలో అనంతరం తిరిగి విశాఖ చేరుకుంటారు. సాయంత్రం 4.15గంటలకు విమానంలో హైదరాబాద్ వెళతారు.

అవకాశాలను అందుకుంటే విజయం మీదే..

- నవ్య ఆలోచనలతో పనిచేసే యువతకు వర్సిటీ స్వాగతం
- ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి
- కెమిస్ట్రీ విభాగంలో వర్క్‌షాప్ ప్రారంభం



విద్యార్థులనుద్దేశించి ప్రసంగిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: నవ్య ఆలోచనలతో పనిచేసే యువతను వర్సిటీ స్వాగతిస్తుందని ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి. ప్రసాదరెడ్డి అన్నారు. వారి ఆలోచనలు ఆచరణలో చూపే విధంగా ప్రోత్సహిస్తుందన్నారు. ఏయూ కెమిస్ట్రీ విభాగంలో విద్యార్థులకు ఉపయుక్తంగా నిలిచే ఐదు రోజుల వర్క్‌షాప్ 'ట్రైనింగ్ ఫర్ ఇండస్ట్రీ 23 24' ను గురువారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రతీ విద్యార్థి తన జీవితంపై సరైన దృక్పథాన్ని కలిగి ఉండాలని సూచించారు. తమ జీవిత కథను రచించుకోవడానిక సిద్ధం కావాలని దిశా నిర్దేశం చేశారు. ప్రతీ రోజు మనకు సరికొత్త అవకాశాలు కల్పిస్తుందని, వీటిని స్వీకరించే సానుకూల దృక్పథం కలిగి ఉండాలని వీసీ సూచించారు. సాధారణ కుటుంబాల నుంచి వచ్చిన మీరంతా అసాధారణ స్థాయికి ఎదగాలనే ఆకాంక్ష, తపనతో ముందడుగు వేయాలన్నారు. ముందుగా మీపై మీరు నమ్మకం కలిగి ఉండాలన్నారు. ఏయూలో నవ్య ఆలోచనలతో పనిచేసే యువతను ప్రోత్సహించే ఏకైక ఉద్దేశంతో అవంతి, ఎలిమెంట్, ఆ హబ్ వంటి స్టార్టప్ వ్యవస్థలను అభివృద్ధి చేసి అందుబాటులో ఉంచామన్నారు. సాధారణ విద్యార్థులుగా ఇక్కడికి వచ్చి, నేడు ఉన్నత స్థానాలకు ఎదిగిన పూర్వ విద్యార్థుల జీవితాలు నేటి తరానికి స్ఫూర్తిగా నిలుస్తాయన్నారు.

రసాయన శాస్త్రం పూర్వ విద్యార్థి దేవ పురాణం ఇటీవల ఎఫ్‌డీఏ డైరెక్టర్‌ను ఏయూకు తీసుకువచ్చిన విధానం, ఫార్మసీ హాస్టల్ నిర్మాణానికి విరాళంగా అందించడం, విభాగానికి కోట్ల రూపాయలు విలువైన ప్రయోగ ఉపకరణాలు అందించడాన్ని విద్యార్థులకు వివరించారు. ఇటువంటి వ్యక్తులను స్ఫూర్తిగా తీసుకుని అత్యున్నత స్థానాలకు చేరాలని ఆకాంక్షించారు.

నిస్వార్థంగా సహాయం చేయాలి : ఓఎన్‌జీసీ సీజీఎం పి.ఎస్.రామారావు మాట్లాడుతూ ప్రతీ ఒక్కరు నిస్వార్థంగా సహాయం చేయాలన్నారు. చిన్న సహాయం, ఉపకారం పొందినా కృతజ్ఞతతో ఉండటం అలవాటు చేసుకోవాలన్నారు. పూర్వ విద్యార్థి నరసింహరావు మాట్లాడుతూ పరిశ్రమల అవసరాలు, పని సంస్కృతిని విద్యార్థులు తెలుసుకోవాలని అన్నారు. ఫార్మా రంగంలో ఉండే విభిన్న విభాగాల పనితీరుపై విద్యార్థులకు శిక్షణలో భాగంగా అవగాహన కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల, ఆచార్య బి.బి.వి శైలజ, ఆచార్య కె.బసవయ్య, ఆచార్య వి. సిద్ధయ్య తదితరులు పాల్గొన్నారు.

జ్ఞానం, నైపుణ్యాలే నిజమైన సంపద

ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి



ఏయూ వీసీ ప్రసాద రెడ్డిని సత్కరిస్తున్న డీఈవో చంద్రకళ



స్టూడెంట్ ఎన్‌రిచ్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొన్న విద్యార్థులు

ఏయూక్యాంపస్: మార్కుల కోసం మధన పడవద్దని, జ్ఞానం, నైపుణ్యాలే జీవితంలో నిజమైన సంపదగా నిలుస్తాయని ఆంధ్రా యూనివర్సిటీ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాద రెడ్డి అన్నారు. ఏపీ ప్రైవేట్ అన్ ఎయిడెడ్ స్కూల్స్ మేనేజ్‌మెంట్స్ అసోసియేషన్(అపుస్మ) విశాఖ జిల్లా ఆధ్వర్యంలో గురువారం ఏయూ స్నాతకోత్సవం మందిరంలో స్టూడెంట్ ఎన్‌రిచ్‌మెంట్ ప్రోగ్రాం(ఎస్‌ఈపీ) నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ మంచి సమాజం నిర్మించడంలో యువత భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు.

మానసిక సన్నద్ధత, సానుకూల దృక్పథంతో పనిచేస్తే విజయం సులభంగా చేరువవుతుందన్నారు. విద్యార్థి కుటుంబ నేపథ్యం, నివసించే ప్రాంతం, మాధ్యమం వంటివి అతడి ప్రగతికి ఎంతమాత్రం అవరోధాలుగా నిలవవనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. విద్యార్థులు తమ మస్తిష్కాల్లో నింపుకునే జ్ఞానమే ఉన్నతిని నిర్ణయిస్తుందన్నారు. సాధారణ కుటుంబాల వారు కూడా అసాధరణ వ్యక్తులుగా ఎదగవచ్చని చెప్పారు.

ఆత్మస్థైర్యంతో పరీక్షలు రాయండి

ఇటీవల కాలంలో స్టార్టప్ కల్చర్ బాగా పెరిగిందని వీసీ ప్రసాదరెడ్డి అన్నారు. సమాజ ఉపయుక్త ఆలోచనలే వ్యాపార అవకాశాలుగా మారుతాయన్నారు. ప్రతీ వ్యక్తి ప్రత్యేకమని, ఒక్కొక్కరికి ఒక్కో విధమైన సామర్థ్యాలు కలిగి ఉంటారన్నారు. రానున్న ఏడేళ్ల కాలం విద్యార్థి జీవితంలో ఎంతో ప్రధానమైనదన్నారు. ఇక్కడ కష్టపడితే తరువాతి ఐదు దశాబ్దాలు ఉన్నతమైన జీవితాన్ని పొందడం సాధ్యపడుతుందనే విషయాన్ని తెలుసుకోవాలన్నారు. విద్యార్థులు తమ సంతోషాలను, బాధలను తల్లిదండ్రులతో పంచుకోవడం అలవాటు చేసుకోవాలని సూచించారు. ఆత్మస్థైర్యంతో పరీక్షలకు హాజరు కావాలని, ఎన్ని మార్కులు వచ్చినా సానుకూలంగా స్వీకరించే తత్వాన్ని పెంపొందించుకోవాలన్నారు. అనంతరం ఏయూ వీసీని డీఈవో ఎల్.చంద్రకళ తదితరులు సత్కరించారు. కార్యక్రమానికి 3 వేల మందికి పైగా విద్యార్థులు హాజరయ్యారు. విద్యార్థులకు పలు రంగాల్లో వ్యక్తిత్వ వికాస నిపుణులతో అవగాహన, ప్రేరణ కలిగించే ప్రసంగాలను అందించారు. అపుస్మ రాష్ట్ర రాష్ట్ర ముఖ్య మార్గదర్శి ఎ.కృష్ణారెడ్డి, రాష్ట్ర కోశాధికారి ఎం.వి రావు, అధ్యక్షుడు డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, కార్యదర్శి ఎం.వి.వి.సత్యనారాయణ, కోశాధికారి జి.శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

16వ వార్డులో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



శంకుస్థాపన చేస్తున్న ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ

మద్దిలపాలెం: జీవీఎంసీ 16వ వార్డులో పలు అభివృద్ధి పనులకు విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు నియోజక వర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ శంకుస్థాపన చేశారు. స్థానిక కార్పొరేటర్ మొల్లి లక్ష్మి, ఏపీఐఐసీ డైరెక్టర్ మొల్లి అప్పారావుతో కలిసి అంబేడ్కర్ కాలనీలో అభివృద్ధి పనులను కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. అనంతరం వార్డులో పర్యటించారు. స్థానికుల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను అక్కడికక్కడే అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించారు. అభివృద్ధి సంక్షేమం రెండు కళ్లుగా భావించి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి రాష్ట్రంలో ప్రజారంజకమైన పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో వార్డు నాయకులు, కన్వీనర్లు, గృహ సారథులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రథసప్తమికి ఆలయాలు సిద్ధం



పుష్పాలంకరణలో సూర్యనారాయణుడు

ఏయూక్యాంపస్: రథసప్తమి పర్వదినానికి ఆలయాలు ముస్తాబవుతున్నాయి. పెదవాల్తేరులోని వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో ఉన్న సూర్యనారాయణ స్వామికి, ఈస్ట్ షిర్డీ ఆలయంలో ఉన్న సూర్యనారాయణ స్వామికి, శ్రీ లలితా పీఠంలో సూర్యనారాయణ స్వామికి శుక్రవారం ప్రత్యేక అభిషేకాలు, పూజలు నిర్వహించడానికి పురోహితులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. ఉదయం నుంచి భక్తుల గోత్రనామాలతో పంచామృతాభిషేకాలు, క్షీరాభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహిస్తారు. పెద్దసంఖ్యలో భక్తులు ఆలయాలకు విచ్చేసి సూర్యనారాయణుడిని దర్శించుకోనున్నారు.

విద్యుత్ సరఫరాకు అంతరాయం నేడు

ఆరిలోవ: పలు సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మతుల నిమిత్తం శుక్రవారం విద్యుత్‌ సరఫరాకు అంతరాయం కలగనుంది. 33/11 ఆరిలోవ ఎస్ఎస్ 11 కేవీ ఫీడర్ మరమ్మతులు జరపనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-3 ఈఈ పి.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈమేరకు సంతపాలెం, తోటగరువు, రవీంద్రనగర్, గాంధీనగర్, బాలాజీనగర్, శ్రీహరినగర్, ముస్తఫా కాలనీ, అన్నానగర్, కైలాసనగర్ తదితర ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

కైలాసగిరి ఫీడర్‌లో..

33/11 కేవీ సబ్‌స్టేషన్ విమ్స్‌కు సంబంధించిన 11 కేవీ కైలాసగిరి ఫీడర్ నిర్వహణ, విద్యుత్ స్తంభాల తరలింపు పనులు నిమిత్తం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఈమేరకు విశాలాక్షినగర్, రెవెన్యూ కాలనీ, కైలాసగిరి రోడ్డు, హనుమంతవాక కొండవాలు, బి.ఎస్.ఆర్.నగర్, తోటగరువు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 5 గంటలు వరకు విద్యుత్ సరఫరా నిలిపేస్తున్నట్లు జోన్-3 ఈఈ శ్రీనివాసరావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

ఇందిరానగర్ ఫీడర్‌లో..

33/11 కేవీ సబ్‌స్టేషన్ విమ్స్‌కు సంబంధించిన 11 కేవీ ఇందిరానగర్ ఫీడర్ పరిధిలో రోడ్ల పక్కన చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనుంది. ఇందిరానగర్, రాజీవ్‌నగర్, ఆదర్శనగర్, సుందర్ నగర్, రవీంద్రనగర్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ ఉండదని, వినియోగదారులు గమనించాలని జోన్-3 ఈఈ శ్రీనివాసరావు కోరారు.

హాస్టల్ మెస్‌ను తనిఖీ చేసిన రిజిస్ట్రార్



ఉద్యోగులతో మాట్లాడుతున్న రిజిస్ట్రార్ స్టీఫెన్

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం న్యాయ విద్యార్థుల వసతిగృహం సమితిని ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్ గురువారం మధ్యాహ్నం సందర్శించారు. భోజన సమయంలో హాస్టల్ మెస్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన ఆయన, విద్యార్థులకు అందిస్తున్న భోజనం నాణ్యతను స్వయంగా పరిశీలించారు. సిబ్బందితో మాట్లాడి, సూచనలు చేశారు. హాస్టల్ చీఫ్ వార్డెన్, వార్డెన్లు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో చీఫ్ వార్డెన్ ఆచార్య జి.వీర్రాజు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల్లో వెలమలకు ప్రాధాన్యం కల్పించాలి



సంఘీభావం తెలుపుతున్న వెలమ సంక్షేమ సంఘాల నాయకులు

సీతమ్మధార: రాష్ట్రంలోని వెలమ సామాజిక వర్గానికి రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో 23 అసెంబ్లీ, 5 పార్లమెంట్ స్థానాల్లో అన్ని రాజకీయ పార్టీలు ప్రాధాన్యం కల్పించాలని వెలమ కుల సంక్షేమ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని వెలమ సంక్షేమ భవనంలో సంఘ సెంట్రల్ ఆర్గనైజేషన్ అధ్యక్షుడు చుక్క చినబాబు ఆధ్వర్యంలో గురువారం రాష్ట్రంలోని వివిధ వెలమ సంక్షేమ సంఘాల అధ్యక్ష, కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చినబాబు మాట్లాడుతూ రాష్ట్రంలో 32 లక్షల వెలమ కులస్తుల జనాభా ఉన్నామని, మరో నాలుగైదు రోజుల్లో వైఎస్సార్‌సీపీ, టీడీపీ, జనసేన, బీజేపీ, కాంగ్రెస్ పార్టీల అధ్యక్షులను కలిసి వినతిపత్రాలు సమర్పిస్తామన్నారు. రాబోయే ఎన్నికల్లో జనాభా దామాషా ప్రకారం సీట్లు కేటాయించాలని కోరారు. ఉమ్మడి విశాఖ జిల్లాలో ఆరు ఎమ్మెల్యే స్థానాలు కల్పించాలని అన్ని రాజకీయ పార్టీలను కోరుతున్నట్లు చెప్పారు. విశాఖ అర్బన్ జిల్లాలోని ఉత్తర, దక్షిణ, గాజువాక, భీమిలి, నియోజకవర్గాల్లో రెండు అసెంబ్లీ స్థానాలను కేటాయించాలని డిమాండ్ చేశారు. వెలమ సామాజిక వర్గానికి ప్రాధాన్యమివ్వలేని పక్షంలో రాబోయే ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతామన్నారు. కార్యక్రమంలో వెలమ సంక్షేమ సంఘాల అధ్యక్షులు, కార్యదర్శులు గంట అప్పలనాయుడు, బంగారు రామకృష్ణ, కూనురెడ్డి శ్రీనివాసరావు, గుణుపూర్ రామారావు, గొట్టాపు చిన్నమనాయుడు, బొత్స వరప్రసాద్, కొండ్రేపు సోమేశ్వరరావు, బొమ్మనేని తిరుపతి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆర్వో వాటర్ ప్లాంట్ ప్రారంభం



వాటర్ ప్లాంట్ ప్రారంభిస్తున్న అతిథులు

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయం రసాయన శాస్త్ర విభాగంలో ఓఎన్‌జీసీ సహకారంతో నూతనంగా నిర్మించిన ఆర్వో వాటర్ ప్లాంట్‌ను ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద రెడ్డి విద్యార్థులతో ప్రారంభింపజేశారు. విభాగ విద్యార్థులకు ఉపయుక్తంగా ఆర్వో వాటర్ ప్లాంట్‌ను అందించిన ఓఎన్‌జీసీ అధికారులకు, యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఓఎన్‌జీసీ సీజీఎం పి.ఎస్.రామారావు, ఏయూ రెక్టార్ ఆచార్య కె.సమత, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాల్ ఆచార్య కె.శ్రీనివాసరావు, విభాగాధిపతి ఆచార్య పి.శ్యామల, ఆచార్య బి.బి.వి శైలజ, ఆచార్య కె.బసవయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ సంక్షేమ ఫలాలు

- విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ 'తూర్పు' సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ
- 40వ రోజుకు పాదయాత్ర



22వ వార్డులో బాలింతకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎంపీ ఎంవీవీ

బీచ్‌రోడ్డు: రాష్ట్రంలోని అర్హులందరికీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం సంక్షేమ పథకాలను అందిస్తోందని విశాఖ ఎంపీ, పార్టీ తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ అన్నారు. 40వ రోజు గురువారం జీవీఎంసీ 22వ వార్డులో ఆయన పాదయాత్రను కొనసాగించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన పేదల సంక్షేమమే ధ్యేయంగా కొనసాగుతోందన్నారు. అటువంటి వ్యక్తి పరిపాలన మరోసారి రాష్ట్రానికి అవసరమన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని ప్రజలను కోరారు. ఇంటింటికీ వెళ్లి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ ప్రజలకు అన్ని వేళల అందుబాటులో ఉంటూ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఎంవీవీ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ వార్డు అధ్యక్షుడు పీతల గోవింద్, పలు కార్పొరేషన్ల డైరెక్టర్లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

19వ వార్డులో..

ఎంవీపీకాలనీ: విశాఖ ఎంపీ, వైఎస్సార్‌సీపీ తూర్పు సమన్వయకర్త ఎంవీవీ సత్యనారాయణ జనం కోసం.. జనంలోనే పేరిట చేపట్టిన పాదయాత్ర గురువారం 19వ వార్డులో ఉత్సాహంగా కొనసాగింది. ప్రజల నీరాజనాలు అందుకుంటూ తూర్పు నియోజవకర్గంలో విస్తృతంగా ఈ యాత్ర కొనసాగుతున్న విషయం తెలిసిందే. 40వ రోజు యాత్రలో భాగంగా 19వ వార్డు పెదజాలరిపేటలో పార్టీ వార్డు ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మీతోపాటు ఎంవీవీ ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలను, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అందిస్తున్న ప్రజాకర్షక పాలన గురించి వివరించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ పాలనకు ప్రజలంతా అండగా నిలవాలని కోరారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీని అత్యధిక సీట్లతో గెలిపించాలని పిలుపునిచ్చారు. స్థానికుల సమస్యలు తెలుసుకుంటూ ముందుకు సాగారు. దాసుతల్లి, రాజు కుటుంబ సభ్యులతో కలిసి ఎంవీవీ మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో పలువురు పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ అనుబంధ కమిటీల్లో నియామకాలు

ఆరిలోవ: వైఎస్సార్‌సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో పార్టీ అధిష్టానం అనుబంధ కమిటీల్లో నియామకాలు చేపట్టింది. విశాఖ జిల్లాలో వివిధ కమిటీల్లో తూర్పు నియోజకవర్గానికి చెందిన 40 మంది నాయకులకు అవకాశం లభించింది.

బీసీ కమిటీలో ఐదుగురు..

జిల్లా బీసీ కమిటీ జనరల్ సెక్రటరీగా కొలగాని వెంకటవరప్రకాష్, సెక్రటరీలుగా సారవకోట శ్రీను, చొక్కాకుల అర్జున్, జాయింట్ సెక్రటరీలుగా కొలపర్తి గోవింద్, కుదిరిపల్లి వెంకటరావు నియామకమయ్యారు.

ఐటీ విభాగంలో ఆరుగురు..

జిల్లా ఐటీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా బొండా ఉమామహేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా బొడ్డేడ వేణుగోపాల్, సెక్రటరీగా సూరాడ ఈశ్వరరావు, జాయింట్ సెక్రటరీలుగా సానికిరెడ్డి రఘురాం, నల్లి సూర్యతేజ, గుజ్జి సురేష్ నియామకమయ్యారు.

మహిళా విభాగంలో ఒకరు..

జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలిగా అద్దాల కృపాజ్యోతిని నియమించారు.

ఎస్సీ విభాగంలో ఏడుగురు..

జిల్లా ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షుడిగా బోని శివరామకృష్ణ, జనరల్ సెక్రటరీగా పిల్లి వీర్రాజు, సెక్రటరీలుగా సంపంగి సురేష్, చిన్న సంగీత రాజు, జాయింట్ సెక్రటరీలుగా దలాని అప్పారావు, కుప్పిలి ధర్మారావు, బంగారి పృథ్వీరాజ్ నియమితులయ్యారు.

ఎస్టీ విభాగంలో ఐదుగురు..

జిల్లా ఎస్టీ విభాగం ఉపాధ్యక్షుడిగా మారిక భాస్కరరావు, సెక్రటరీగా తుడుము మరియమ్మ, సెక్రటరీలుగా మారిక చంద్రమౌళి, మోహన్‌కృష్ణ కుమారి, శెట్టి కామేశ్వరరావు నియమితులయ్యారు.

విద్యార్థి విభాగంలో ఆరుగురు..

జిల్లా విద్యార్థి విభాగం ఉపాధ్యక్షుడిగా పులగం కొండారెడ్డి, జనరల్ సెక్రటరీగా కింతాడ ప్రవీణ్‌కుమార్, సెక్రటరీలుగా బి.హరికృష్ణ, సువ్వాడ వాసు, జాయింట్ సెక్రటరీలుగా గరికన అజయ్, బొట్టా కిశోర్ నియమితులయ్యారు.

చేనేత విభాగంలో ఐదుగురు..

జిల్లా చేనేత విభాగం జనరల్ సెక్రటరీగా ఆకుల త్రినాథ్, సెక్రటరీలుగా సూరిశెట్టి రావాలు, శేసెట్టి వెంకట్, జాయింట్ సెక్రటరీలుగా నూలు రామారావు, శేసెట్టి చంద్రరావు నియమితులయ్యారు.

యువజన విభాగంలో ఐదుగురు..

జిల్లా యువజన విభాగం జనరల్ సెక్రటరీగా పల్ల సాయిసుమంత్, సెక్రటరీలుగా ఎనిమరెడ్డి హరిశివ రాజశేఖర్‌రెడ్డి, కర్రి ప్రసాద్, జాయింట్ సెక్రటరీలుగా వాసుపల్లి రాజేష్, బడిమడుల సాల్మన్‌రాజ్ నియమితులయ్యారు.

సమ్మెను జయప్రదం చేయండి



మాట్లాడుతున్న పడాల రమణ

మద్దిలపాలెం: కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అవలంబిస్తున్న కార్మిక, కర్షక, ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా శుక్రవారం తలపెట్టిన దేశవ్యాప్త సమ్మెను అన్ని వర్గాల ప్రజలు జయప్రదం చేయాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి పడాల రమణ పిలుపునిచ్చారు. ఇసుకతోటలోని సంఘ కార్యాలయంలో గురువారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీజేపీ పాలనలో గత పదేళ్లుగా కార్మికులకు అన్యాయం జరుగుతోందన్నారు. ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని నమ్మబలికారన్నారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు లబ్ధి చేకూర్చేలా పాలన సాగిస్తోందని చెప్పారు. అసంఘటిత కార్మిక వర్గానికి సామాజిక భద్రత చట్టాన్ని తీసుకురావాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను నిలిపివేయాలని ఆయన డిమాండ్ చేశారు. సమావేశంలో ఏఐటీయూసీ నాయకులు వాలడా జనార్దన్, గండ్రెడ్డి సతీష్, ఎ.రామారావు, డి.రమణ, సోమినాయుడు, గంగు నాయుడు, వై.నాగరాజు, ఎస్.రమేష్ తదితరులు పాల్గొన్నారు.

4,157 మందికి జగనన్న ఆరోగ్య సురక్ష సేవలు



ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాన్ని సందర్శించి సూచనలు చేస్తున్న డీఎంహెచ్‌వో జగదీశ్వరరావు

మహారాణిపేట: రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు గురువారం అర్బన్ పరిధిలో 10 ప్రాంతాల్లో జరిగాయి. సాగర్‌నగర్, ఎంఎస్‌ఆర్ లేఅవుట్, ఎన్‌జీజీవో కాలనీ, భీమనగర్‌లో రెండు చోట్ల, రైల్వే న్యూకాలనీ, అంబేడ్కర్ కాలనీ, పెద గంట్యాడ, సిద్ధేశ్వరం, చంద్రనగర్, తదితర ప్రాంతాల్లో జరిగిన ఈ శిబిరాల్లో మొత్తం 4,157 మందికి వైద్య సేవలు అందజేశారు. వీరిలో ఏడుగురిని మెరుగైన వైద్యం కోసం వైఎస్సార్ ఆరోగ్యశ్రీ కింద కార్పొరేట్ ఆస్పత్రులకు రిఫరల్ చేశామని డీఎంహెచ్‌వో తెలిపారు. పెందుర్తి మండలం సరిపల్లి గ్రామంలో శుక్రవారం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం జరగనుందని పేర్కొన్నారు.

మృతుడి కుటుంబానికి బీమా సొమ్ము అందజేత



మృతుడి భార్యకు నగదు అందిస్తున్న ఎంపీ ఎంవీవీ తదితరులు

ఎంవీపీకాలనీ: ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన వాడమోదుల కానులు (42) కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం రూ.10 వేలను ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ అందజేశారు. 19వ వార్డు జాలరిపేటలోని మృతుడి నివాసానికి గురువారం వెళ్లి పరామర్శించిన ఎంపీ, మృతుడి భార్య వాడమోదుల దుర్గకు ఈ నగదును స్వయంగా అందజేశారు. ప్రభుత్వం తరఫున అన్ని విధాల సహకారం అందిస్తామన్నారు. కార్యక్రమంలో 19వ వార్డు వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జి సూరాడ వెంకటలక్ష్మి, వాడమోదుల గణేష్, బెహరా వసంత తదితరులు పాల్గొన్నారు.